సాక్షి నిజామాబాద్

ఆదివారం । 25 । జూన్ । 2023



విత్తనోత్పత్తికి ప్రోత్సాహం

జిల్లాలో సోయా విత్తనోత్పత్తి కోసం 180 క్వింటాళ్ల విత్తనాలను అధికారులు రైతులకు పంపిణీ చేశారు.

- 8లో ▸



రేపటి నుంచి రైతుబంధు

వర్షాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం సొమ్మును సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో వేయనున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.9 /25.3

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు తగ్గవచ్చు. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల ఉరుములతో కూడిన గాలివాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

26న దోస్త్ స్పెషల్ కేటగిరి ధ్రువపత్రాల పరిశీలన

మోపాల్(నిజామాబాద్‌రూరల్): డిగ్రీలో ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 26న దోస్త్ స్పెషల్ కేటగిరి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని టీయూ డైరెక్టర్, అడ్మిషన్స్ డాక్టర్ సంపత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలోని డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు(పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్) అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామన్నారు.

నీట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఇంటర్మీడియెట్ 2022–23లో ఉత్తీర్ణులై నీట్–2023లో సాధారణ ప్రతిభ కనబర్చిన ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థుల నుంచి నీట్ 2024 దీర్ఘకాలిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆర్‌సీవో మేరీ యేసుపాదం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి రూ. 200 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 30 చివరి తేదీ అని, నోటిఫికేషన్, ఇతర వివరాలకు సొసైటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేరీ యేసుపాదం కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి




మోపాల్(నిజామాబాద్‌రూరల్): మహిళలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. శనివారం డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)ని సందర్శించారు. సంస్థలో జరుగుతున్న సెల్‌ఫోన్ మరమ్మతులు, ఫొటోగ్రఫీ, ఆర్థిక అక్షరాస్యత తరగతులను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న వివిధ మండలాలకు చెందిన 110 మందికి సైబర్ నేరాలు, నగదు లావాదేవీలు, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డీఆర్‌డీవో వెంట డీపీఎం రాచయ్య, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్‌కుమార్, తదితరులున్నారు.

గోదావరిలో రెండు నెలలు చేపల వేట నిషేధం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ ఎగువ, దిగువ ప్రాంతాల్లోని గోదావరిలో వచ్చే రెండు నెలల పాటు చేపల వేటను నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలకు గోదావరిలో నీటి ప్రవాహం అధికమై వివిధ చేపల సంతానోత్పత్తి జరుగుతుందన్నారు. తద్వారా మత్స్యకారులకు మరింత ఉపాధి లభిస్తుందన్నారు. ఇందుకు జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు ఎవరూ చేపల వేటకు వెళ్లకూడదన్నారు. వేటకు వెళ్లనివ్వకుండా చర్యలు తీసుకోవాలని నందిపేట్, నవీపేట్, డొంకేశ్వర్, రెంజల్, ముప్కాల్, మెండోరా, ఆర్మూర్, వేల్పూర్ తహసీల్దార్లతో పాటు పోలీసు అధికారులకు కూడా లేఖ రాశామన్నారు. మండలాల పరిధిలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కూడా ఈ విషయాన్ని తమ గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): జంతు సంక్షేమం దృష్ట్యా ఏర్పాటు చేసిన గోవధ నిషేద చట్టం –1977ను పక్కాగా అమలయ్యేలా చూడాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధం, పశు రవాణా అంశాలపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర జంతు సంక్షేమ నియమాల గురించి వివిధ శాఖల అధికారులతో చర్చించారు. జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘన జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

సాగుకు సమాయత్తం



కాలూర్ శివారులో నారుమడి

ఈ సీజన్‌లో ఇప్పటివరకు వేసిన పంటలు.. (ఎకరాల్లో..)

వరి	7,530
మొక్కజొన్న	1,968
సోయాబీన్	20
పసుపు	1,915

అవసరమయ్యే ఎరువులు.. (మెట్రిక్ టన్నుల్లో..)

యూరియా	89,836
డీఏపీ	21,619
ఎంవోపీ	6,657
కాంప్లెక్స్	32,383

అవసరమయ్యే విత్తనాలు.. (క్వింటాళ్లలో..)

వరి	1,25,382
మొక్కజొన్న	2,575
పెసర	12
కంది	75
మినుము	10
సోయా	17,615
పత్తి	3,606 (ప్యాకెట్లు)

- తొలకరి పలకరింత.. అన్నదాతల పులకింత
- ఇప్పటికే జిల్లాలో 11,433 ఎకరాల్లో వరి, మక్క, పసుపు, సోయా వేసిన రైతులు
- ఈ వానాకాలం ప్రతిపాదిత సాగు విస్తీర్ణం 5,37,078 ఎకరాలు
- సాగు ప్రణాళికను సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో తొలకరి పలకరించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సాహంగా సాగుకు సమాయత్తం అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 5,37,078 ఎకరాల్లో వరి, మక్క, సోయా, పత్తి, కంది, పెసర, మినుము, వేరుశనగ, పసుపు, ఇతర వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే జిల్లాలో ఇప్పటికే 11,433 ఎకరాల్లో వరి, మక్క, సోయా, పసుపు పంటలను రైతు లు నాటారు. ఇందులో వరి 7,530 ఎకరాలు, మక్క 1,968 ఎకరాలు, పసుపు 1,915 ఎకరాలు, సోయా 20 ఎకరాల్లో విత్తారు. ఇక పంటల సాగు ప్రణాళిక నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు ఈ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువుల (యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్) వివరాలను సైతం తయారు చేశారు. విత్తనాల విషయానికి వస్తే వరి 1,25,382 క్వింటాలు అవసరముండగా, ప్రస్తు తం 1,54,583 క్వింటాలు అందుబాటులో ఉండ డం గమనార్హం. అలాగే సోయా 17,615 క్వింటాళ్లు అవసరముండగా 1,700 క్వింటాళ్లు, మక్క 2,575 క్వింటాళ్లు అవసరముండగా ప్రస్తుతం 450 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన అన్నిరకాల విత్తనాలు తక్షణమే అందించేందుకు ప్రభు త్వం రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

ఈ వానాకాలం సాగయ్యే పంటల అంచనా వివరాలు

పంట పేరు	ఎకరాలు...
వరి	4,17,943
మొక్కజొన్న	32,185
సోయా	58,715
పత్తి	1,803
కంది	1,883
పెసర	151
మినుము	125
వేరుశనగ	204
పసుపు	23,722
ఇతర పంటలు	347
మొత్తం	5,37,078

తొలకరి వర్షాలతో పంటలకు ప్రాణం



ఐదెకరాల్లో సోయా, మూడెకరాల్లో పసుపు, ఎకరంలో మక్క సాగు చేస్తున్నాం. మొన్నటి వరకు వర్షాలు లేక మొలకలు వాడిపోయాయి. తొలకరి వర్షాలు రావడంతో పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. బోరు నీటికి, వర్షపు నీటికి చాలా తేడా ఉంటుంది.

– సుచిత, మహిళా రైతు, డొంకేశ్వర్

రెండు వారాలు ఆలస్యంగా వర్షాలు...



జూన్ మొదటివారంలో పడాల్సిన తొలకరి వర్షాలు రెండు వారాలు ఆలస్యంగా వచ్చాయి. మరోవారంలో నాట్లు ప్రారంభిస్తాం. సుమారు పదెకరాల్లో నారు సిద్ధంగా ఉంది. ఆలస్యంగానైన వర్షాలు రావడం సంతోషం. సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆశిస్తున్నా.

–సుధాకర్‌రెడ్డి, రైతు, కంజర్



నగరంలో వర్షంలో గొడుగు పట్టుకుని వెళ్తున్న యువతి

మోస్తరు వాన

- జిల్లా వ్యాప్తంగా 6.9 మిల్లీమీటర్ల వర్షపాతం
- రాబోయే రెండ్రోజులు కురిసే అవకాశం

సుభాష్‌నగర్: జిల్లాలో జిల్లావ్యాప్తంగా శనివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. గత 24 గంటల్లో 6.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటగిరి, పోతంగల్, నిజామాబాద్‌రూరల్, నందిపేట్, మెండోరా, చందూర్ మండలాల్లో వాన కురిసింది. మిగతా మండలాల్లోనూ తేలికపాటి వర్షం పడింది. రాబోయే రెండ్రోజులు కూడా మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతా వరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తొలకరి వర్షాలు కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఆరుతడి పంటలతో పాటు వరి సాగుకు సిద్ధమవుతున్నారు.

మండలం	వర్షం (మిల్లీమీటర్లు)	మండలం	వర్షం (మిల్లీమీటర్లు)
కోటగిరి	26.0	మాక్లూర్	11.8
పోతంగల్	24.3	రెంజల్	11.8
నిజామాబాద్‌రూరల్	20.8	బోధన్	11.3
నందిపేట	20.3	ఏర్గట్ల	10.5
చందూరు	19.8	డొంకేశ్వర్	10.3
మెండోర	18.8	ఎడపల్లి	8.3
నవీపేట	14.0	కమ్మర్‌పల్లి	7.8
		బోధన్	6.5
		మోస్రా	6.0

మోదీ పాలన స్వర్ణయుగం

ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన స్వర్ణ యుగమని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. 'సంపర్క్ సే సమర్థన్' కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలన వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి సేవలందిస్తున్న గడ్డం (పైపుల) రాజారెడ్డి నిస్వార్థ సేవలు నేటి తరానికి ఆదర్శమని ఎంపీ ధర్మపురి కొనియాడారు. నిర్వాహకులతో మాట్లాడి వృద్ధులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయన తొమ్మిదేళ్ల పాలనపై ముద్రించిన పుస్తకాన్ని వారికి అందజేశారు. అనంతరం వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న రాజారెడ్డిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, జెస్సు అనిల్, ఆకుల రాజు, యామాద్రి భాస్కర్ పటేల్, చరణ్‌రెడ్డి తదితరులున్నారు.

తొమ్మిదేళ్లుగా సుపరిపాలన

సుభాష్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన స్వర్ణ యుగమని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. శనివారం నగరంలోని శశాంక్ ఆస్పత్రిలో 'సంపర్క్ సే సమర్థన్' కార్యక్రమంలో భాగంగా ఎముకలు, కీళ్ల శస్త్రచికిత్సల వైద్యుడు మోతిలాల్ నాయక్‌ను ఎంపీ కలిశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమ పథకాల గురించి ఎంపీ వివరించారు. అనంతరం తొమ్మిదేళ్ల పాలనపై రూపొందించిన పుస్తకాన్ని మోతిలాల్ నాయక్‌కు అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి లింగం ఉన్నారు.



గడ్డం రాజారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

క్రియాశీల రాజకీయాల్లోకి హరిభూషణ్!

- 'భట్టి'ని కలిసి మద్దతు తెలిపిన మాజీ నక్సలైట్
- కాంగ్రెస్‌తో కలిసి నడుస్తామని ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశం

సాక్షి, కామారెడ్డి: మాజీ మావోయిస్టు నేత హరిభూషణ్ అలియాస్ షమీర్ పాషా క్రియాశీల రాజకీయాలవైపు అడుగులు వేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి నడిచేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలో విస్తృత పరిచయాలు ఉన్న హరిభూషణ్ గతంలో కొంత కాలం టీడీపీలో ఆ తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరినా ఆ పార్టీల్లో ఇమడలేకపోయారు. కొద్దికాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన.. తన అనుచరులతో చర్చించుకుని కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను ఈనెల 23న హరిభూషణ్ నేతృత్వంలో మాజీ నక్సల్స్ కలిసి పన్నెండు అంశాలను ఆయన ముందుంచినట్లు తెలుస్తోంది. ప్రజలకు సంబంధించిన ఆయా అంశాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టాలని కోరగా ఆయన సమ్మతించినట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామని హరిభూషణ్, ఆయన అనుచరులు ప్రకటించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో పాటు పొరుగునే ఉన్న మెదక్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఆయనకు 'మాజీ'లతో సన్నిహిత సంబంధాలున్నాయి.

నక్సల్ నేతగా గుర్తింపు

అప్పట్లో ఉమ్మడి జిల్లాలో నక్సలైట్లు సమాంతర పాలన సాగించారు. ఆ సమయంలో హరిభూషణ్ పేరు చెబితే రాజకీయ నాయకులు వణికిపోయేవారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు ఆయన కనుసన్నల్లో నడిచాయి. ముఖ్యంగా కామారెడ్డి, సిర్నాపల్లి, ఎల్లారెడ్డి దళాలు తిరిగిన ప్రాంతాల్లో ఆయన విప్లవోద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేశారు. దళ కమాండర్‌గా, జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీ మెంబర్‌గానూ పనిచేశారు. ఆయన ఆధ్వర్యంలో ఎన్నో సంచలన సంఘటనలు జరిగాయి. తరువాతి కాలంలో మావోయిస్టు పార్టీలో వివిధ అంశాల్లో విమర్శలకు గురై డిమోషన్ పొందారు. కొంతకాలం కామారెడ్డి ప్రాంతంలో మావోయిస్టు పార్టీలో కొనసాగిన హరిభూషణ్.. అప్పట్లో దళ కమాండర్‌గా పనిచేసిన సునీత అలియాస్ ఉమతో పాటు మరికొందరిని వెంట తీసుకుని ఉద్యమాన్ని వదిలారు. హరిభూషణ్, సునీతలు పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఒక కూతురు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.



విస్తృత పరిచయాలు

నందిపేటకు చెందిన షమీర్ పాషా అలియాస్ హరిభూషణ్ రెండు దశాబ్దాల పాటు విప్లవోద్యమంలో పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో ఆయనకు విస్తృత పరిచయాలున్నాయి. ఆయనతో కలిసి పనిచేసిన 'మాజీ'లు చాలామంది ఆయనతో టచ్‌లో ఉన్నారు. తన జీవిత సహచరి మాజీ మావోయిస్టు దళ కమాండర్ సునీత అలియాస్ ఉమతో కలిసి మాజీలను సమీకరించి రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని మాచారెడ్డి, రామారెడ్డి, సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, తాడ్వాయి, రాజంపేట, కామారెడ్డి, భీంగల్, ఆర్మూర్, వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, గాంధారి, బాన్సువాడ, వర్ని, లింగంపేట, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాల్లో హరిభూషణ్‌కు చాలామంది మాజీ నక్సల్స్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజలతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

వర్షాలు లేటైనా.. అదును దాటలేదు

- జూలై నెలంతా విత్తనాలు విత్తుకోవచ్చు
- వరినారు పోసేందుకు మధ్య, స్వల్పకాలిక రకాలు మేలు
- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి
- ఫోన్ ఇన్‌లో డీఏవో తిరుమల ప్రసాద్

డొంకేశ్వర్(ఆర్మూర్) : వర్షాలు ఆలస్యమైనప్పటికీ విత్తనాలు విత్తేందుకు అదును దాటలేదని జిల్లా వ్యవసాయాధికారి ఆర్.తిరుమల ప్రసాద్ స్పష్టం చేశారు. తొలకరి జల్లులు వ్యవసాయానికి అనుకూలమని, తేలికపాటి భూముల్లో ఆరు సెంటీ మీటర్లు, బరువు నేలల్లో ఏడు సెంటీ మీటర్ల వర్షం పడిన తర్వాతే విత్తనాలు వేయాలని సూచించారు. శనివారం నిర్వహించిన 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో ఆయన మాట్లాడారు. వానకాలం సాగులో విత్తనాల ఎంపిక, ఎరువులు, మందుల వాడకం, ఏ భూముల్లో ఎలాంటి పంటలు వేయాలి, సాగు పనులకు ఇప్పుడున్న వాతావరణం అనుకూలమేనా, మార్కెట్లో నకిలీ విత్తనాల బెడదపై రైతులు అడిగిన ప్రశ్నలకు డీఏవో సమాధానాలిచ్చారు. మక్క జూలై 15 వరకు, సోయా ఈ నెలాఖరు, వచ్చేనెల మొదటి వారం దాకా, అలాగే పప్పు దినుసులు జూలై నెలంతా, వరినాట్లు ఆగస్టు 15 వరకు వేసుకోవడానికి సమయం ఉన్నట్లు పేర్కొన్నారు.

సాక్షి ఫోన్ ఇన్

■ సోయా విత్తుకోవచ్చా, ఏ విత్తనాలు మంచివి..? – వెంకట్ రాజు, ధర్పల్లి
– తిరుపతి, టాక్లి, పోతంగల్ మండలం

● యాజమాన్య పద్ధతులు పాటించి జూలై నెలాఖరు వరకు సోయా విత్తనాలు వేసుకోవచ్చు. బాసర, భీమ్, కరిష్మా లాంటి మంచి విత్తనాలున్నాయి. రెండు కేజీల నైట్రోజన్, కేజీ భాస్వరం దుక్కిలో వేసుకోవాలి. నారు ఎర్రబడకుండా జింక్‌ను స్ప్రే చేసుకోవాలి.

■ వర్షాలు ఆలస్యమయ్యాయి, ఏ రకాలు వేస్తే బాగుంటుంది?
– శ్రీనివాస్ రెడ్డి, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం
– నర్సయ్య, మగ్గిడి

● నైరుతి ఆలస్యం కారణంగా జిల్లాలో ఇంకా విస్తృతంగా వర్షాలు పడలేదు. అదును దాటలేదు కనుక మధ్య, స్వల్పకాలిక రకాల వరి విత్తనాలకు వెళ్తే బాగుంటుంది. జేజీఎల్–1798, జేజీఎల్–3844, కేఎన్ఎమ్–118, జేజీఎల్–18047, ఆర్ఎన్ఆర్–125 వంటి సన్నాలను నార్లు పోసుకోవాలి. వీటికి అగ్గి తెగులు, మొగి పురుగు తట్టుకునే శక్తి ఉంది. నాట్లు వేసుకుంటే 120 రోజుల్లో పంట చేతికొస్తుంది.

■ ప్రస్తుతం పరిస్థితుల్లో పసుపు విత్తుకోవచ్చా..?
– నోముల రాజు, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం

● వర్షాలకు నేల అంతగా తడవలేదు. తేమను చూసుకుని పసుపు విత్తుకోవడం ఉత్తమం. ట్రాక్టర్‌తో కాకుండా నాగలితో దున్నితే నేలలో తేమ శాతం ఏర్పడుతుంది. కాబట్టి మరో రెండు వర్షాలు పడిన తర్వాత పసుపు విత్తితే బాగుంటుంది. సస్య రక్షణ చర్యలు తప్పనిసరి.



■ సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహకం ఉందా? – తిరుపతి రెడ్డి, జక్రాన్‌పల్లి

■మక్కను పురుగు ఆశిస్తోంది, నివారణ చర్య?
– గంగారాం, మంథని, ఆర్మూర్ మండలం

● మొక్క దశలోనే మక్కను పురుగు ఆశిస్తోందంటే వాతావరణ పరిస్థితులు కావొచ్చు. ఇందుకు దుక్కిలోనే గులికలు వేసుకుంటే పురుగు బెడద ఉండదు. వేపనూనె, తయోడికార్బ్ చల్లాలి. లేత ఆకులను కత్తెరకాటు లాంటి పురుగుల నుంచి రక్షించుకోవచ్చు.

– గంగారెడ్డి, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం

● సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం, పండ్ల తోటలను పెంచే రైతులకు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ఏమీ లేవు. పీకేబీవై పథకంలో ఇన్‌పుట్స్ ఉన్నాయి. జిల్లాలో ఆరు క్లస్టర్లలో ఇది అమలవుతోంది. జక్రాన్‌పల్లిలో కూడా అమలు చేసేలా ప్రయత్నం చేస్తాం. సేంద్రియ సాగుపై ఇతర రైతులకు మీ ద్వారా అవగాహన కల్పిస్తాం. ఏఈవోలకు కూడా సూచనలిస్తాం.

■ జీలుగ ఎదగడం లేదు, కారణం ఏమై ఉండొచ్చు..?
– సతీశ్, డిచ్‌పల్లి

● వర్షాలు లేక ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. తద్వారా జీలుగ ఎదగకపోవడానికి కారణం కావొచ్చు. పక్షం రోజుల కిందటే వేశారు కనుక నీటిని అందించాలి. యూరియా ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దు. అలాగే వరిలో ఎంటీయూ–1156 విత్తనం వాడితే బాగుంటుంది.

■ వరిలో దోమ నివారణకు చర్యలేంటి?
– లింగారెడ్డి, రెంజర్ల, ముప్కాల్ మండలం

● నాట్లేసిన వరికి మొక్క దశలోనే దోమ ఆశిస్తే అసెఫ్ట్ అనే మందును ఎకరానికి కిలో చొప్పున వాడాలి. ఇలా చేస్తే దోమను అరికట్టవచ్చు. అయినప్పటికీ నివారణ కాకపోతే స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదిస్తే వారు కొన్ని మందులను సూచిస్తారు.

■ ఆయిల్‌పాం సాగుకు విద్యుత్ తీగలు అడ్డంకిగా మారాయి
– గంగారెడ్డి, నూత్‌పల్లి, డొంకేశ్వర్ మండలం

● ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. విద్యుత్ శాఖ అధికారులతో కూడా మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేందుకు వీలైనంత త్వరగా కృషి చేస్తాం. ఇందుకు స్థానిక వ్యవసాయాధికారులకు లిఖిత పూర్వకంగా ఒక దరఖాస్తు ఇవ్వండి.

■ కొత్తిమీర, సోయా మొలకెత్తలేదు, లోపం విత్తనాలదేనా..? – రాంరెడ్డి, ధర్పల్లి
– బంజ రాజు, సిర్పూర్, డొంకేశ్వర్ మండలం

● కొత్తిమీర, సోయా మొలకెత్తకపోవడానికి విత్తనాల లోపంతో పాటు వాతావరణ పరిస్థితులు కూడా కారణం కావొచ్చు. ఏఈవోను మీ వద్దకు పంపుతాను. వారికి మీ వద్ద ఉన్న ప్యాకెట్లను చూపించండి. లోపం నేలదా, విత్తనాలదో తేలుతుంది. ఒకవేళ విత్తన లోపమైతే సదరు డీలరు, కంపెనీపై చట్టపరచర్యలు తీసుకుంటాం.

■ నకిలీ విత్తనాలను గుర్తించడమెలా..?
– తిరుపతి రెడ్డి, నికాల్‌పూర్, డొంకేశ్వర్ మండలం

● పత్తి, మిరప విత్తనాల్లోనే ఎక్కువగా నకిలీలు ఉండే అవకాశముంది. వరితో నకిలీలు ఉండవు. ఏ విత్తనాలైన లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలి. విత్తనాలు వేసిన తర్వాత ఖాళీ అయిన ప్యాకెట్లను జాగ్రత్తగా పెట్టుకోవాలి. విత్తనాల్లో లోపాలు తలెత్తితే సంబంధిత డీలర్ షాప్‌పై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా తనిఖీలు చేపడుతున్నారు.

క్లుప్తంగా

గ్రూప్‌-4 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఖలీల్‌వాడి: జూలై 1న నిర్వహించే గ్రూప్‌-4 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల వద్ద ఎలాంటి షాపులు తెరిచి ఉంచవద్దని సూచించారు.

ధాన్యం బకాయిలు ఇవ్వాలని రైతుల ఆందోళన

బోధన్‌రూరల్: బోధన్ మండలం ఘన్‌పూర్ చౌరస్తాలో రైస్‌మిల్లు యాజమాని ధాన్యం బకాయిలు (పాతవి) చెల్లించడం లేదని రైతులు ఆందోళన చేశారు. బోధన్ పట్టణ శివారులోని బాల గణపతి ఆగ్రో ఇండ్రస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాని రాంబాబు ధాన్యం డబ్బులు ఇవ్వకుండ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం బోధన్ – రుద్రూర్ రహదారి ధర్నా నిర్వహించారు. ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు అక్కడకు చేరుకుని న్యాయం జరిగిలే చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిజాయితీ చాటుకున్న సిర్‌పూర్ వాసి



మోపాల్: నగరంలోని వేములపల్లి శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులకు చెందిన బంగారం, నగదుతో కూడిన బ్యాగు మండలంలోని సిర్‌పూర్ వాసి షేక్ హైదర్‌కు దొరకగా, ఆ బ్యాగును శనివారం మోపాల్ పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. శ్రీనివాస్‌రావు తన కుటుంబంతో బాసర నుంచి నిజామాబాద్‌కు ఆటోలో వస్తుండగా బ్యాగు పడిపోయింది. అదేసమయంలో ఆ రోడ్డులో ధర్మాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తున్న షేక్ హైదర్‌కు దొరికింది. ఆయన ఆ బ్యాగ్‌ను మోపాల్ ఎస్‌హెచ్‌ఓ మహేష్‌కు అప్పగించాడు. బ్యాగు తెరిచి చూడగా అందులో 8 తులాల బంగారం (సుమారు రూ.5లక్షలు విలువైనవి), రూ.20వేల నగదు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. బ్యాగు యజమానికి కనుక్కొని వారికి హైదర్ చేతుల మీదుగా అప్పగించారు. నిజాయితీని చాటుకున్న హైదర్‌ను పోలీసులు అభినందించారు.

ఉచితంగా 'సివిల్స్' శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: సివిల్ సర్వీస్ మెయిన్స్ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి శశికళ తెలిపారు. వార్షికాదాయం రూ.మూడు లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ నెల 30 లోగా హైదరాబద్‌లోని ఎస్సీ స్టడి సెంటర్‌లో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు తమ వెంట యూపీఎస్సీ హాల్‌టికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్ తీసుకెళ్లాలని సూచించారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

మోపాల్: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు శనివారం కొనసాగాయి. ఉదయం 6వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు మొత్తం 5,863 మంది విద్యార్థులకు 5,529 మంది, మధ్యాహ్నం జరిగిన ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 1,639 మందికి 1539 మంది హాజరయ్యారని పరీక్షల నియంత్రణ అధికారి అరుణ తెలిపారు. ఈ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేశామన్నారు.

విత్తనోత్పత్తికి ప్రోత్సాహం

- నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో..
- 2,250 ఎకరాలకు 180 క్వింటాళ్ల సోయా విత్తనాల పంపిణీ



దొన్కల్ రైతు వేదికలో ఉచితంగా విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ తదితరులు

మోర్తాడ్(బాల్కొండ): సోయా విత్తనోత్పత్తి కార్యక్రమానికి వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. గత వర్షాకాలం సీజనులో చేపట్టిన విత్తనోత్పత్తి కార్యక్రమం మంచి ఫలితాలను ఇవ్వడంతో ఈసారి విత్తనోత్పత్తిని గణనీయంగా విస్తరించారు. నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో ఉత్పత్తి చేసిన బాసర రకం సోయా విత్తనాలను ఈ సీజనులోను విస్తారంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. 2022 వర్షాకాలం సీజనులో ఒక్క హాసకొత్తూర్‌లోనే 200 ఎకరాల్లో విత్తనోత్పత్తి కార్యక్రమం కొనసాగించారు. ఈసారి మాత్రం జిల్లా వ్యాప్తంగా 2,250 ఎకరాల్లో విత్తనోత్పత్తిని చేపట్టడానికి 180 క్వింటాళ్ల సోయా విత్తనం పంపిణీ చేశారు. అత్యధికంగా బాల్కొండ నియోజకవర్గంలోని రైతాంగానికి ప్రోత్సాహం అందించడం విశేషం. ఒక్కో సోయా విత్తనం కిట్టులో 8 కిలోల వంగడం నింపి రైతులకు అందిస్తున్నారు. ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. సోయాకు సంబంధించి ప్రైవేటు కంపెనీల విత్తనాలనే ఎక్కువగా రైతులకు అందుబాటులో ఉంచారు. ప్రైవేటు కంపెనీల విత్తనం జెర్మినేషన్ సరిగా రాకపోవడంతో పంట వృద్ధి చెందకపోవడం, దిగుబడిపై ప్రభావం చూపడంతో రైతులు భారీగా నష్టపోయారు. గత సీజను నుంచి పరిశోధన క్షేత్రంలో ఉత్పత్తి చేసిన బాసర రకంను అందుబాటులోకి తీసుకరావడం గమనార్హం.

ఎంపిక చేసిన మండలాలకే..

జిల్లాలోని అన్ని మండలాలకు కాకుండా ఎంపిక చేసిన మండలాల్లోనే సోయా విత్తన కిట్లను వ్యవసాయ శాఖ పంపిణీ చేసింది. మోర్తాడ్, వేల్పూర్, కమ్మర్‌పల్లి మండలాల్లో 705 ఎకరాలకు 56.40 క్వింటాళ్లు, ఆర్మూర్, నందిపేట్ మండలాలకు 470 ఎకరాలకు 37.60 క్వింటాళ్లు, బోధన్, రెంజల్ మండలాలకు 605 ఎకరాలకు 48.40 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి మండలంలో 235 ఎకరాలకు 18.80 క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉంచారు. కోటగిరి మండలంలో 235 ఎకరాల్లో సాగు చేయడానికి 18.80 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేశారు. గత సీజనుతో పోల్చితే విత్తనోత్పత్తి విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. ముందు ముందు మరింత ఎక్కువ ఎకరాలకు విత్తనం పంపిణీ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రైతుల ప్రయోజనం కోసం..

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సోయా విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని విస్తరించాం. ఈసారి ఏకంగా రెండు వేల ఎకరాలకు మించి విత్తనోత్పత్తి కార్యక్రమం విస్తరించడం గొప్ప విషయం. వ్యవసాయ శాఖ సూచనలు, సలహాల ప్రకారం రైతులు సోయా సాగు చేసి మంచి ఫలితాలను సాధించాలి.

– కాలువ మల్లయ్య, ఏడీఏ, భీమ్‌గల్

ఎప్పుడు రమ్మన్నా వస్తా!

- ప్రభుత్వ విప్ గంపకు మాజీ మంత్రి షబ్బీర్ ప్రతి సవాల్



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

సాక్షి, కామారెడ్డి: టేక్రియాల్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని చెప్పినా.. ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చెవికి ఎక్కడం లేదని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆరోపించారు. శనివారం కామారెడ్డిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో మీడియాతో వెళ్లి చూశానని తెలిపారు. ఇంజినీర్లను తీసుకురమ్మని ఎమ్మెల్యే సవాల్ చేశారని, అయితే ఇంజినీర్లు ప్లాన్ ఇస్తారే తప్ప నిర్మాణ పనులు చేసేది మేస్త్రీలని, అందుకే తాను అనుభవం ఉన్న మేస్త్రీలను తీసుకుని ఇళ్ల వద్దకు వెళ్లానని చెప్పారు. సవాల్ విసిరిన ఎమ్మెల్యే అక్కడికి రాకుండా తప్పించుకున్నాడన్నారు. దశాబ్ది ఉత్సవాలు పూర్తయిన తరువాత వస్తానని ఎమ్మెల్యే ప్రకటించాడని, తాను కామారెడ్డిలోనే ఉన్నానని, ఎప్పుడు రావాలో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంత మందితో రావాలో చెప్పాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందని, ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఆ ఇళ్లను కూల్చి కొత్తవి నిర్మించాలని డిమాండ్ చేశారు. తాను వెళ్లి వచ్చిన తరువాత ఆ ఇండ్ల బెస్మెంట్‌లకు మరమ్మతులు మొదలు పెట్టారని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, కారంగుల అశోక్‌రెడ్డి, బీంరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, నౌసీలాల్, గడీల నర్సింలు, భూమాగౌడ్, కుంట లింగారెడ్డి, సందీప్, శివకృష్ణ, నర్సాగౌడ్, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే..

- రాష్ట్రానికి ప్రధాని, కేంద్ర మంత్రులు వస్తే కలవరు
- ఢిల్లీ వెళ్లి కలవడంలో మతలబేంది?
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

సాక్షి, కామారెడ్డి: రాష్ట్రానికి ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రులు ఎప్పుడు వచ్చినా కేసీఆర్, కేటీఆర్‌లు కలవలేదని, అలాంటిది ఇప్పుడు మంత్రి కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో ఉన్న మతలబు ఏంటో ప్రజలకు వెల్లడించాలని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. శనివారం కామారెడ్డిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ, బీజేపీ ఒక్కటేనని తాము రెండేళ్లుగా చెబుతున్నామన్నారు. లిక్కర్ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి జైల్లో ఉంటే, ఎమ్మెల్సీ కవిత బయట ఎలా ఉంటుందో ప్రజలకు అర్థమైందన్నారు. కవితను బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందన్నారు. కేటీఆర్ పర్యటన వెనుక రహస్య ఎజెండా ఉందని ఆరోపించారు. కాళేశ్వరంలో కేసీఆర్ అవినీతిని బయటపెడతామన్న బండి సంజయ్ కూడా నోరు మెదపడం లేదన్నారు.

వృద్ధుడిని కొట్టి దోపిడీ

ఖలీల్‌వాడి: వృద్ధుడిని కొట్టి అతడి వద్ద ఉన్న ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం.. బోధన్ మండలం ఎరాజ్‌పల్లికి చెందిన పోతుల పోశెట్టి శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఆస్పత్రికి ఆరోగ్యం బాగాలేక వచ్చాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద చాయ్ తాగడానికి వెళ్లగా ఒకతను బైక్‌పై వచ్చి ఆయన మాట్లాడాడు. అనంతరం బెదిరించి బైక్ ఎక్కించుకొని ఆర్మూర్ వైపు తీసుకెళ్లాడు. పోశెట్టి వద్ద ఉన్న రెండు తులాల వెండి ఉంగరాలు, రెండు గ్రాముల బంగారు చెవిపోగుతోపాటు రూ.600 లాక్కొన్నాడు. తర్వాత అతన్ని కొట్టి ఆర్మూర్‌లో వదిలి వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రేపు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

నిజామాబాద్‌అర్బన్: మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం సమ్మె నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి చక్రపాణి తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.8 కోట్ల వరకు బకాయి ఉందన్నారు. ఆ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది కొత్త మెనూ అమలు చేయాలని కార్మికులపై ఒత్తిళ్లు చేస్తున్నారని, దీంతో మళ్లీ అప్పుల పాలు అవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే సమ్మె చేస్తున్నటు తెలిపారు. జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ ఉదయం 10 గంటల వరకు నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింగరావు, మధ్యాహ్న భోజన కార్మికులు గంగాధర్, బాలరాజు, గంగమణి, నాగలక్ష్మి, ఉమా, పెద్దమ్మి, లావణ్య పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు

- కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగపూర్ పరిధిలోని డెయిరీ ఫామ్ కెనాల్ కట్టకు చెందిన గౌరవ్ వాగ్మారే నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ గౌడ్ తెలిపారు. గౌరవ్ పాస్‌పోర్టుకు ఈ నెల 10న దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దీనికోసం నకిలీ ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ బోనాఫైడ్ సమర్పించినట్లు తెలిపారు. ఎంక్వయిరీ చేసిన ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితుడి రిమాండ్

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన సింగజోగు సురేష్ అనే నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సురేష్ తన భార్య రాధను ఈ నెల 21న కత్తితో పొడిచి చంపే యత్నం చేశాడన్నారు. గాయాలపాలైన రాధ జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

రెంజల్: చేపల వేటకు వెళ్లిన ఒకరు ఈత రాక నీట మునిగి చనిపోయారు. ఎస్సై సాయన్న కథనం ప్రకారం.. బోధన్ మండలం కోప్పెర్గ గ్రామానికి చెందిన బండారి గంగాధర్(32)కు భార్య భారతి, నలుగురు పిల్లలు ఉన్నారు. గంగాధర్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన తన స్నేహితులైన ఈశ్వర్, భోజన్నతో కలిసి శుక్రవారం రెంజల్ మండలం నీలా పెద్ద వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వాగులో దిగి చేపలు పడుతుండగా నీటిలో మునిగిపోయాడు. వెంటనే స్నేహితులు గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో నీలా జాలార్లతో వాగులో వెతికించినా ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో శనివారం వచ్చి గాలించగా మృతదేహం లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: రైలు నుంచి జారి పడిన ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామారెడ్డి మండలం నరసన్నపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి పడినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు క్షతగాత్రుడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్న రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పశువులు..



సదాశివనగర్: మండలంలోని ధర్మారావ్‌పేట్ గ్రామంలో శనివారం తెగిపడ్డ విద్యుత్ వైర్లకు తగిలి రెండు పశువులు మృతి చెందాయి. గ్రామంలోని జమాల్‌పూర్ మధుకర్‌రావుకు చెందిన జెర్సీ ఆవు, సంకరజాతి గేదెలను పొలం నుంచి తీసుకొస్తుండగా ఎల్లమ్మ ఆలయం సమీపంలో పంట చేనులో ఈదురు గాలులకు తెగిపడ్డ విద్యుత్ వైర్లకు తగిలి మృతి చెందాయి. ఈ పశువులతో పాటు వాటి వెంట వస్తున్న రెండు కుక్కలు కూడా మృతి చెందినట్లు సర్పంచ్ బడాల భాస్కర్ రెడ్డి తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్

- ఒకరికి గాయాలు

బాన్సువాడ: బీర్కూర్ సమీపంలోని మిర్జాపూర్ రోడ్డు వద్ద శనివారం బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. నందిపేట్‌కు చెందిన శంకర్ బైక్‌పై మద్నూర్ మండలం పెద్ద ఎక్లార గురుకుల పాఠశాలలో తన కుమార్తెను వదిలి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో శంకర్ రెండు కాళ్లు విరిగాయి. క్షతగాత్రున్ని బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన సిబ్బంది నిజామాబాద్‌కు తరలించారు.

గంజాయి అమ్ముతున్న యువకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి వద్ద గల శైలజ గ్రౌండ్‌లో ఎండు గంజాయిని అమ్ముతున్న షేక్ ఇస్లాంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వేణుమాధవరావు తెలిపారు. శుక్రవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఇస్లాంపై ఇప్పటి వరకు మూడు కేసులు నమోదు అయ్యాయన్నారు. గంజాయితోపాటు బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రామ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ రాజన్న, కానిస్టేబుల్స్ అవినాష్, విష్ణు, శివ ఉన్నారు.

బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఇద్దరిపై కేసు

గాంధారి: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఇద్దరిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో మద్యం తాగుతున్న ఆర్మూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి గంగాధర్, మంత్రి రాములుపై కేసు నమోదు చేశామన్నారు.

రేపటి నుంచి రైతుబంధు



మోర్తాడ్: వర్షాకాలం సీజను పెట్టుబడి సాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈనెల 26 నుంచి రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.5వేలు అందించాలని సీఎం చంద్రశేఖర్‌రావు గతంలోనే ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖలను ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ శాఖ ఆర్థిక శాఖను సమన్వయం చేసుకుని రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడానికి సన్నాహాలు చేస్తుంది. యాసంగి సీజనులో జిల్లాలోని 2,78,351 మంది రైతులకు రూ.274 కోట్ల సాయం జమ చేశారు. కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు మాత్రం సాయం అందించడానికి వీలు పడలేదు. అప్పట్లో ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసినా ఈసారి మరోసారి నమోదు చేసి రైతుబంధు సాయం కోసం జాబితాలను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈ లెక్కన రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య గతంలో కంటే పెరగనుంది. మొదటి రోజున ఎకరం లోపు భూమి ఉన్నవారికి, రెండో రోజు రెండు ఎకరాల లోపు, మూడో రోజు మూడు ఎకరాల లోపు భూమి ఉన్నవారికి సాయం అందనుంది. ఇలా విడతల వారీగా పదిహేను రోజుల్లో అందరు రైతులకు సాయం జమ చేయనున్నారు.

ఖాతా నంబర్లు మార్చిన వారికి ఆలస్యమే..

గతంలో పెట్టుబడి సాయం కోసం ఒక బ్యాంకు ఖాతా ఇచ్చి ఆ స్థానంలో మరో నంబర్ మార్చాలని విన్నవించిన వారికి పెట్టుబడి సాయం ఆలస్యంగానే జమ కానుందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఖాతాల మార్పులకు అవకాశం కల్పించినా సాంకేతిక కారణాలతో సాయం అందించడానికి తీవ్ర జాప్యం జరుగుతుంది. కొత్తగా పేర్లు నమోదు చేసుకున్నవారికి, ఖాతా నంబర్లను మార్చుకున్నవారికి పెట్టుబడి సాయం ఆలస్యంగా అందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

తల్వేదవాసికి జాతీయ అవార్డు



చెన్నయ్య స్వామి

నందిపేట్: నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన మఠం చెన్నయ్య స్వామికి జాతీయ మహానంది అవార్డు వచ్చింది. తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలు 2023 కోసం తెలుగు వెలుగు సాహితి స్వచ్ఛంద సంస్థ వారు జ్యోతిష్య అర్చక, పురోహిత రంగంలో మఠం చెన్నయ్య స్వామిని ఎంపిక చేశారు. ఆదివారం గుంటూర్‌లోని చుట్టగుంట పోలేరమ్మ దేవస్థానంలో ఈ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు.

ఎత్తొండ దీపక్ స్వామీజీకి..



దీపక్ స్వామి

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ మఠం దీపక్ స్వామీజీకి మహానంది పురస్కారం లభించింది. వాస్తు జ్యోతిష్య అర్చక పురోహిత రంగంలో ఆయన ఎంపికయ్యారు.

పదవులు శాశ్వతం కాదు

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



బాల్కొండలో ప్రజా కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండలో నిర్మించిన ప్రజా కల్యాణ మండపాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో తాను ఉన్నా.. లేకున్నా.. అభివృద్ధి మాత్రం వెనక పడొద్దన్నారు. సీఎం కేసీఆర్ దయతో బాల్కొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. ప్రజలు మరోసారి గెలిపిస్తే మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తానని చెప్పారు. ప్రజా కల్యాణ మండపాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ మండల కేంద్రాల్లో కల్యాణ మండపాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలన్నారు. కల్యాణ మండపాల్లో వంట సామగ్రి, డైనింగ్ టేబుళ్లు, కుర్చీలను తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో అందిస్తానని మంత్రి తెలిపారు. ఈ కల్యాణ మండపాల నిర్వాహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగిస్తామన్నారు. ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ వాహబ్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, సహకార సంఘం చైర్మన్ సురాజ్‌రెడ్డి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ వినోద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ అదనపు తరగతి గదుల ప్రారంభం

బాల్కొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కిసాన్‌నగర్‌లో బాల్కొండ నుంచి ముప్కాల్ వరకు గల పాత జాతీయ రహదారి పునరుద్ధరణ పనులకు, నాగాపూర్ నుంచి గోదావరి వరకు రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు.

విజిట్ వీసాతో గల్ఫ్‌కు..

- పని దొరకక మస్కట్‌లో ఉప్పల్‌వాయి వాసి మృతి
- ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలి : మృతుడి భార్య



సిద్ధిరాములు(ఫైల్)

రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన పురం సిద్ధిరాములు (46) మస్కట్‌లో మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆమె కథనం ప్రకారం.. సిద్ధిరాములకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. సిద్ధిరాములు ఐదు నెలల క్రితం బతుకు దెరువు కోసం వీజిట్ వీసాపై మస్కట్ వెళ్లాడు. గల్ఫ్ పంపిన పోసానిపేటకు చెందిన ఏజెంట్ అక్కడికి వెళ్లిన తర్వాత ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. తీరా అక్కడకు వెళ్లాక ఐదు నెలలు గడిచిన చూపకపోవడంతో 20 రోజుల నుంచి సిద్ధిరాములు రోడ్డున పడ్డాడు. ఉపాధి లేక తిండి దొరక్క గత శనివారం మృతి చెందినట్లుగా నాగమణి తెలిపారు. విజిట్ వీసాపై పంపి మోసం చేసి తన భర్త మరణానికి కారణమైన ఏజెంట్‌ను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించాలని కోరారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరో ముగ్గురికి గాయాలు



వెంకటలక్ష్మిదేవి మృతదేహం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

సదాశివనగర్: మండలంలోని దగ్గి అటవీ ప్రాంతం శివారులో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటనా వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా తిరుమలాపూర్‌కు చెందిన పసుపులేటి వెంకటలక్ష్మిదేవి(39), పసుపులేటి లక్ష్మీనారాయణ, చక్రాల బాలాజీ, డ్రైవర్ శ్రీనివాస్ వ్యాపార నిమిత్తం ఈ నెల 22న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ పట్టణానికి వెళ్లారు. శుక్రవారం అక్కడి నుంచి తిరుగు పయనమయ్యారు. శనివారం వారు దగ్గి అటవీ ప్రాంతం శివారుకు రాగానే కారు డ్రైవర్ శ్రీనివాసులు అతివేగంతో, అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళ్తున్న కంటైనర్ ట్రక్కును వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, వెంకటలక్ష్మి దేవికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటలక్ష్మిదేవి మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అశోక్‌సాగర్‌లో తేలిన బాలుడి మృతదేహం

ఖలీల్‌వాడి/ఎడపల్లి: ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లోని అశోక్‌సాగర్‌లో శుక్రవారం గల్లంతైన బాలుడి మృతదేహం లభించిందని ఎస్సై సాయికుమార్‌గౌడ్ శనివారం తెలిపారు. వివరాలు.. నగరంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన కొడపు మోహన్, లక్ష్మి దంపతులకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. రెండో కుతూరు త్రివేణి అలియాస్ అక్షయకు జీడిమెట్లకు చెందిన హేమంత్‌తో 2016లో వివాహం అయింది. చిన్న కూతురు నిఖితకు 2018లో చేగుంటకు చెందిన మహేష్‌తో పెళ్లి జరిగింది. వివాహ సమయంలో ఇద్దరికి బైపాస్ రోడ్డులో 200 గజాల ప్లాట్‌ను కట్నంగా ఇచ్చారు. రెండో అల్లుడు హేమంత్, చిన్న అల్లుడు మహేష్ తరచు ప్లాట్ అమ్మి డబ్బులు తీసుకు రావాలని భార్యలను వేధించేవారు. దీంతో త్రివేణి తన కొడుకు నమోత్, నిఖిత తన కొడుకు భవేష్, కూతురు క్షేమను తీసుకొని శుక్రవారం ఉదయం 7 గంటలకు అశోక్ సాగర్ దగ్గరికి వెళ్లి పిల్లలను నీటిలో తోసేసి వారు కూడా ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు నలుగురిని కాపడగా భవేష్ గల్లంతు కావడంతో శనివారం శవమై తెలినట్లు తెలిపారు. దీంతో బాధిత మహిళల తండ్రి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.